## క్లుప్తంగా

### సీఎం జగన్‌ను కలసిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఎంపీ సురేష్

**అల్లవరం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అసెంబ్లీ ఆవరణలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అధ్యక్షతన జరిగిన ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారానికి ముందుగా సీఎం జగన్‌ను కలసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. సీఎం జగన్‌కు ఇజ్రాయిల్ పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట బాపట్ల ఎంపీ నందిగం సురేష్ ఉన్నారు.

### వైఎస్సార్ సీపీ నాయకుడి మృతికి సంతాపం



బిళ్లకుర్తి కొండలరావు(ఫైల్)

**తాళ్లరేవు:** ఉప్పంగల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల నాయకుడు బిళ్లకుర్తి కొండలరావు బుధవారం ఉదయం గుండె పోటుతో మృతి చెందారు. బుధవారం రాత్రి గుండెపోటు రావడంతో ఆయన్ని కాకినాడ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కొండలరావు భౌతికకాయాన్ని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, సర్పంచ్ శాఖా శంకరుడు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, లచ్చిపాలెం సొసైటీ అధ్యక్షుడు దవులూరి శ్రీరామ్మూర్తి, పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు.

### భావజాల వారోత్సవాలు

**ఐ.పోలవరం:** పూలే, అంబేడ్కర్ భావజాల వారోత్సవాలు రెండో రోజు బుధవారం కొనసాగాయి. మురమళ్ల శాంతినికేతన్ హైస్కూల్‌లో ప్రముఖ వైజ్ఞానిక సాహితీ సంస్థ ప్రజ్ఞ సాహితీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పి.వెంకటేశ్వరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాసాహితీ గౌరవ అధ్యక్షుడు విత్తనాల వరప్రసాదరావు మాట్లాడారు. అనంతరం సాహితీ సభలు, కళారూపాల ప్రదర్శనలు జరిగాయి.

### 14న అంబేడ్కర్ జయంత్యుత్సవం

**యానాం:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని యానాం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బుధవారం ఆహ్వాన సంఘం ప్రతినిధులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు మెట్టకూరు రమాభాయి నగర్‌లో జరిగే కార్యక్రమాల్లో భాగంగా ఉద్యోగ విరమణ చేసిన వారికి సన్మానం, 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు.

### 235 మద్యం సీసాల స్వాధీనం

**తాళ్లరేవు:** యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి అక్రమంగా మద్యం తరలిస్తున్న కొత్త బాలకృష్ణను గురువారం అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్సై పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. జాతీయ రహదారి 216లోని జార్జిపేట చెక్‌పోస్టు వద్ద ట్రావెల్ బ్యాగ్‌తో అనుమానాస్పదంగా వెళ్తున్న అతనిని ఆపి పరిశీలించగా బ్యాగ్‌లో 235 మద్యం సీసాలు లభ్యమయ్యాయన్నారు. నిందితుడు నెల్లూరు జిల్లా తోటపల్లిగూడు మండలం వరిగొండ గ్రామానికి చెందిన వ్యక్తి.

### టిప్పర్ దగ్ధం

**యానాం:** గోపాల్‌నగర్‌లో బుధవారం టిప్పర్ లోడు దింపుతుండగా హెచ్‌టీ విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అగ్నికి ఆహుతైంది. వైర్లు తగలడంతో ఒక్కసారిగా అగ్నికీలలు వ్యాపించి టిప్పర్ టైర్లు, వైరింగ్ పూర్తిగా కాలిపోయింది. డ్రైవర్ కేబిన్‌లో నుంచి దూకి ప్రాణాలను రక్షించుకున్నాడు. యానాం ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను అదుపు చేసింది. సుమారు రూ.3 లక్షల నష్టం ఉంటుందని అధికారులు తెలిపారు. ఎస్సై శేరు నూకరాజు కేసు నమోదు చేశారు.

### రాఘవులపేటలో అగ్నిప్రమాదం

**ఉప్పలగుప్తం:** ఎస్.కొత్తపల్లి పంచాయతీ పరిధి రాఘవులపేటలో తవిటిక రామస్వామికి చెందిన తాటాకిల్లు బుధవారం కాలిపోయింది. రామస్వామి, అతని భార్య కూలి పని నిమిత్తం ఉదయం ఇంటి నుంచి బయలు దేరారు. ఇంతలో ఆ ఇంట్లో మంటలు రేగాయి. స్థానికులు వెంటనే మంటలను అదుపు చేశారు. ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఆర్‌ఐ ఎం.వెంకటరమణ సంఘటనా స్థలానికి చేరుకుని రూ.50 వేల ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేశారు. బాధితులకు తక్షణ సాయంగా 10 కిలోల బియ్యాన్ని అందించారు.

# అజాగ్రత్తతో అగ్గి.. రాజుకుంటే బుగ్గి

- అప్రమత్తతతో ప్రమాదాల నివారణ
- నష్ట నివారణకు అవగాహన అవసరం




ముమ్మిడివరం అగ్నిమాపక కేంద్రం

**ముమ్మిడివరం:** సూరీడు నేలకొచ్చినట్టు ఎండలు మంట రేపుతున్నాయి.. జనానికి సెగలు పుట్టిస్తున్నాయి.. సామాన్య ప్రజలను అల్లాడిస్తున్నాయి.. ఈ సమయంలోనే చిన్నపాటి అజాగ్రత్తతో అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉంది. తద్వారా సర్వం బుగ్గి అవుతోంది.. తీవ్ర నష్టాన్ని మిగుల్చుతోంది.. ఎండాకాలం, మండించే కాలం కాబట్టి అప్రమత్తత అవసరమని అగ్నిమాపక శాఖ అధికారులు సూచిస్తున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో గతేడాది మొత్తం 36 అగ్ని ప్రమాదాలు జరగ్గా, సుమారు రూ.36.44 లక్షల ఆస్తినష్టం సంభవించింది. ఇందులో 31 చిన్న ప్రమాదాలు, 3 మధ్యస్తం, రెండు పెద్ద ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల సమయంలో అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి సుమారు రూ.50.80 లక్షల ఆస్తినష్టం జరగకుండా నివారించారు. నియోజకవర్గంలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాలతో పాటు అయినవిల్లి, ఉప్పలగుప్తం మండలాల్లో 73 గ్రామాలు ముమ్మిడివరం అగ్నిమాపక కేంద్రం పరిధిలోకి వస్తాయి. ఐ.పోలవరం మండలం భైరవపాలెం, గోగుల్లంక, భైరవలంక, కాట్రేనికోన మండలం మాగసానితిప్ప, చిర్రయానం, బలుసుతిప్ప గ్రామాలకు అగ్నిమాపక శకటాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఈ ప్రాంతాలకు నాటు పడవలపై పంప్ సిస్టమ్‌ను తీసుకువెళ్లి మంటలను అదుపు చేయాల్సి వస్తోంది. అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

**సమయ స్ఫూర్తి అవసరం**

ప్రస్తుతం ఎండలు అధికమయ్యాయి. ఈ సమయంలో అగ్ని ప్రమాదం జరిగితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. నియోజకవర్గంలో అధిక శాతం లంక గ్రామాలు, మారుమూల ప్రాంతాలు కావడంతో ఏ చిన్న ప్రమాదం జరిగినా అంతా బుగ్గే అవుతోంది. గతంలో తీర గ్రామాల్లో జరిగిన అగ్ని ప్రమాదాల్లో భారీ నష్టం చూడాల్సి వచ్చింది. ప్రమాదాలు జరిగిన సమయంలో సమయ స్ఫూర్తితో వ్యవహరిస్తే నష్టాన్ని నివారించవచ్చని అధికారులు చెబుతున్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీతో పాటు గ్రామ పంచాయతీల డంపింగ్ యార్డులు, చెత్తకుప్పల వద్ద నిప్పురవ్వలు రాజుకుని పెను ప్రమాదాలకు దారితీసే అవకాశాలున్నాయి. డంపింగ్ యార్డుల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే పొలాల వద్ద గడ్డివాముల విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలి.

**ఇలా చేద్దాం..**

కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గి పుల్లలను ఆర్పివేసిన తర్వాత పారేయాలి. చెత్త, గడ్డి, ఎండిన చెట్లు, పూరిపాకల వద్ద వీటిని వేయరాదు. ఎక్కువ రోజులు ఇంట్లో లేని సమయంలో విద్యుత్తు మెయిన్ ఆఫ్ చేయాలి. వంట గదిలో గాలి, వెలుతురు ఉండేలా చూసుకోవాలి. గృహాలకు గడ్డివాములు 60 అడుగుల దూరంలో వేసుకోవాలి. పూరి పాకల్లో నివసించే వారు వంట పూర్తయిన వెంటనే పొయ్యిలో నిప్పును ఆర్పి వేయాలి. వేసవిలో ఉదయం 8 గంటల లోపు, సాయంత్రం 6 గంటల తరువాత కట్టెల పొయ్యిలను ఉపయోగించాలి. గ్యాస్ సిలెండర్‌కు దగ్గరలో పెట్రోలు, డీజిల్, కిరోసిన్ వంటి మండే వస్తువులను ఉంచరాదు. వంట పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ ఆపి వేయాలి. అపార్ట్‌మెంట్లు, కర్మాగారాల గోదాములు, గిడ్డంగులలో అగ్నిమాపక శాఖ సూచనలు విధిగా పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు.

**సమాచారం అందిస్తే స్పందిస్తాం..**



అగ్ని ప్రమాదాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందిస్తే వెంటనే స్పందిస్తాం. అగ్నిమాపక శకటం వచ్చేలోగా నీటితో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించాలి. తద్వారా నష్టం కాస్త తగ్గుతుంది. ప్రమాదం జరిగిన వెంటనే 08856–271101కు ఫోన్ చేసి తెలపండి.

–మురళీ కొండబాబు, ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి, ముమ్మిడివరం

### కలెక్టర్‌కు ప్రజా సంఘాల వినతి



కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం అందిస్తున్న దళిత ప్రజా సంఘాల ప్రతినిధులు

**అమలాపురం టౌన్:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఈ నెల 14న జరుగనున్న నేపథ్యంలో ఆ రోజు జిల్లాలో మద్యం దుకాణాలు మూసివేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ హిమాన్షు శుక్లాను జిల్లా దళిత ప్రజా సంఘాల ప్రతినిధులు బుధవారం కలసి వినతిపత్రం అందించారు. మహనీయుల జయంతి రోజుల్లో మద్యం దుకాణాలను మూసివేసే సంప్రదాయాన్ని కొనసాగించాలని వారు కోరారు. తమ విజ్ఞాపనపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని జిల్లా దళిత ఐక్య వేదిక చైర్మన్ డీబీ లోక్, కన్వీనర్ జంగా బాబూరావు తెలిపారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, దళిత ప్రజా సంఘాల ప్రతినిధులు దేవరపల్లి శాంతికుమార్, విప్పర్తి రమణ, బొంతు రమణ, శెట్టిబత్తుల తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

### ముగ్గురికి కోవిడ్ పాజిటివ్

**కాట్రేనికోన:** పల్లంకుర్రు పీహెచ్‌సీ పరిధి బలుసుతిప్పలో మూడు కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదైనట్లు వైద్యాధికారి స్వాతి తెలిపారు. జలుబు, దగ్గు, జ్వరంతో ముగ్గురు రాగా కోవిడ్ పరీక్షలు నిర్వహించడంతో పాజిటివ్ వచ్చిందన్నారు.

# జన నినాదం జగన్



రానేల్లంకలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ జగతా పద్మనాభం తదితరులు



కొమరగిరిపట్నంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

**అమలాపురం టౌన్:** అందరి నోటా 'జగనన్నే మా భవిష్యత్తు' అనే మాట వినిపిస్తోంది.. వచ్చే ఎన్నికల్లో సంక్షేమ సారథికి తిరిగి పట్టం కడతామంటూ ప్రజలంతా చెబుతున్నారు. అమలాపురం మున్సిపాలిటీలోని 30 వార్డుల్లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా సాగింది. ఆయా వార్డుల కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులు ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగేళ్లలో జగనన్న పాలనలో అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కౌన్సిలర్ బండారు గోవింద్, నాగారపు వెంకటేశ్వరరావు, చిత్రపు రామకృష్ణ, కట్టోజు సన్నయ్యదాసు, పార్టీ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, దొంగ చిన్నా, సుంకర సుధ, చిక్కాల రవిశంకర్, కల్వకొలను ఉమ, రాజీ రమేష్ తదితరులు తమ వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజా మద్దతు పుస్తకంలో వివరాలు నమోదు చేస్తున్నారు.

**ముమ్మిడివరం:** మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామ, వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ తిరిగి ప్రజా సర్వే చేస్తున్నారు. ప్రజల అంగీకారంతో ఇంటి గోడలకు జగనన్నే మా నమ్మకం అంటూ స్టిక్కర్లు అంటిస్తున్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జగతా పద్మనాభం, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, ఎంపీపీ కోలా గంగాభవాని, కోలా బాబ్జి, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఐ.పోలవరం:** జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని సర్పంచ్ దంతులూరి రాఘవరాజు అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఐ.పోలవరం గ్రామంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు నిర్వహించారు. సీఎం జగన్ నాలుగేళ్ల పాలనలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని వారు తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సర్వే చేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విత్తనాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ వెంకట్రామయ్య, కొర్లపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**అల్లవరం:** కొమరగిరిపట్నంలో సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఎంట్రుకోనలో మాజీ ఎంపీటీసీ సాపే సత్యనారాయణ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. కోడూరుపాడు, అల్లవరం, బోడసకుర్రు, దేవగుప్తం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజా సర్వే చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ యల్లమిల్లి బోసు, మండల కార్యదర్శి వాసంశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.

# ప్రతి గడపకూ సంక్షేమం చేరువ

**కాట్రేనికోన:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ అన్నారు. బుధవారం కాట్రేనికోన సచివాలయం–1 పరిధి లచ్చిరాజు చెరువులో సర్పంచ్ గంటి వెంకటసుధాకర్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. నాయకులు పాలెపు ధర్మారావు(పల్లం), నల్లా నరసింహమూర్తి, సంసాని నాగేశ్వరరావు, నడింపల్లి సూరిబాబులతో కలసి ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. పేదల సంక్షేమానికి పాటుపడుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని ఆయన ప్రజలను కోరారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. అనంతరం కాట్రేనికోన మార్కెట్ ప్రాంతంలో గ్రామ దేవత భాగిర్తమ్మను దర్శించుకున్నారు. నాయకులు కాశి హనుమంతరావు, వాసంశెట్టి శ్రీనివాసరావు, వజ్రపు సత్యనారాయణ, జగడం బాలయ్య, దొమ్మేటి వెంకట్రావు, మద్దాల నాని తదితరులు పాల్గొన్నారు.



కాట్రేనికోనలో పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

**అర్హులందరికీ పథకాలు**

**అమలాపురం రూరల్:** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. గున్నేపల్లి అగ్రహారం గ్రామంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగాబత్తుల కొండ, నాయకులు కేతా సాయిబాబా, మద్దింశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాలుగేళ్ల పాలనలో అర్హులకు అందిన లబ్ధిని శ్రీకాంత్ వివరించారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, వైస్ ఎంపీపీ పోలమూరి బాలకృష్ణ, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, కేతా భానుతేజ తదితరులు పాల్గొన్నారు.



గున్నేపల్లిలో పథకాల గురించి వివరిస్తున్న మంత్రి తనయుడు డాక్టర్ శ్రీకాంత్

## రీజెన్సీ ఫ్యాక్టరీని పునః ప్రారంభించాలి

**యానాం:** వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించిన రీజెన్సీ టైల్స్ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించేలా ప్రభుత్వం సహకరించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పుదుచ్చేరి జిల్లా కలెక్టర్ వల్లవన్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం మూసివేసిన రీజెన్సీ టైల్స్ తయారీ పరిశ్రమను వారు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2012లో జరిగిన దుర్ఘటన నేపథ్యంలో పరిశ్రమ మూతపడిందని అన్నారు. ఈ పరిశ్రమను తెరిపించేలా సంబంధిత యాజమాన్యం సహకరిస్తే వేలాది మంది కార్మికులకు ఉపాధి కలుగుతుందని అన్నారు. యానాంలో సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా రీసైక్లింగ్ ప్లాంట్‌ను నెలకొల్పుతున్నట్లు కలెక్టర్ వల్లవన్ తెలిపారు. నియోజకవర్గంలో సేకరించే చెత్తను రీసైక్లింగ్ ప్లాంట్‌కు తరలించి సేంద్రియ ఎరువుల తయారీ చేయనున్నట్లు తెలిపారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాల ప్రకారం రీసైక్లింగ్ ప్లాంట్‌కు స్థానిక పవర్ గ్రిడ్‌ను ఆనుకుని ఉన్న 6 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని సంబంధిత సంస్థకు బదిలీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.



రీజెన్సీ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న పుదుచ్చేరి కలెక్టర్ వల్లవన్, ఎమ్మెల్యే అశోక్, ఆర్ఏఓ మునిస్వామి

## అభాగ్యులకు అన్నదానం అమోఘం

**ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్**

**తాళ్లరేవు:** స్థానిక లయన్స్ క్లబ్ ద్వారా అభాగ్యులతో పాటు, గర్భిణులకు ఉచిత అన్నదానం చేయడం అమోఘమని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక సామాజిక ఆసుపత్రి ప్రాంగణంలో దివంగత చిట్టూరి కృష్ణ జ్ఞాపకార్థం లయన్స్ ఆర్యజనని ట్రస్ట్ ద్వారా తలపెట్టిన గర్భిణులకు ఉచిత భోజన పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళ్లరేవు లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని, ముఖ్యంగా ఆసుపత్రి డైరెక్టర్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి ప్రారంభించిన అభాగ్యులకు ఉచిత క్యారేజీ భోజన పథకం వారి కుటుంబాలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఆయన చేస్తున్న సేవలు ఎనలేనివని అన్నారు. అనంతరం సీహెచ్‌సీలో ఆసుపత్రి డైరెక్టర్ అద్దంకి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఫ్రెండ్స్ అసోసియేషన్ ఫర్ ఏ ఛేంజ్ సహకారంతో గర్భిణులకు డెలివరీ సమయంలో ఉపయోగపడే రూ.20 వేల విలువ చేసే కానెల్స్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా సీహెచ్‌సీ వైద్యురాలు శిరీషకు అందజేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, నాయకులు దున్నా జనార్దనరావు, కుడుపూడి శివన్నారాయణ, ఎంపీటీసీ సభ్యులు నందికోళ్ల శ్రీదేవి, పోతుల రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



తాళ్లరేవులో గర్భిణులకు భోజన ప్యాకెట్లు ఇస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తదితరులు

### నిత్యాన్నదానానికి విరాళాలు

**ఆత్రేయపురం:** కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి విరాళాలు అందినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. మొగల్తూరుకు చెందిన సి.హనుమంతరావు-హిమబిందు రూ.16,080, కాకినాడకు చెందిన కె.సతీష్‌కుమార్-లక్ష్మీ కల్యాణి రూ.10,116, హైదరాబాద్‌కు చెందిన సి.శ్రీరామచంద్రమూర్తి, పద్మావతి దంపతులు రూ.10,001 విరాళం అందించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ సిబ్బంది చేతులమీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

### సంచార పుస్తక ప్రదర్శన

**అమలాపురం టౌన్:** సాహితీ బుక్ హౌస్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సంచార పుస్తక ప్రదర్శన బుధవారం ఏర్పాటైంది. ప్రజల వద్దకే విజ్ఞానం లక్ష్యంతో రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో సంచార పుస్తక ప్రదర్శన ద్వారా సాహితీ బుక్ హౌస్ సంస్థ ప్రత్యేక బస్సులో ఈ సౌకర్యం కల్పిస్తోందని నిర్వాహకుడు కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పుస్తక ప్రదర్శన అమలాపురంలో ఐదు రోజుల పాటు ఉంటుందని అన్నారు. చరిత్ర, సైన్స్, డిక్షనరీలు, స్పోకెన్ ఇంగ్లిషు, గ్రామర్, పర్సనల్ డెవలప్‌మెంట్, కథా నవలలు, విద్య, ఆధ్యాత్మికం, పర్యావరణం, పెద్ద బాలశిక్ష తదితర పుస్తకాలు 10 శాతం రాయితీపై పొందవచ్చని వెంకటేశ్వరరావు సూచించారు. ఈ అవకాశాన్ని పట్టణ, పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థులు, మేధావులు, రచయితలు, సాహితీ అభిమానులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



ఎస్పీని సన్మానిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

**అంబాజీపేట:** నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో తలమునకలవుతున్న ఉద్యోగులకు క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో పోలీస్ వర్సెస్ రెవెన్యూ స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌ను బుధవారం నిర్వహించారు. జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించి బదిలీపై తూర్పు గోదావరి వెళుతున్న సందర్భంగా సుధీర్‌కుమార్ రెడ్డితో స్నేహ పూర్వక మ్యాచ్ నిర్వహించామన్నారు. అనంతరం ఎస్పీని ఘనంగా సన్మానించారు. నిర్ణిత 20 ఓవర్ల మ్యాచ్‌లో ఎస్పీ జట్టు విజయం సాధించింది, ఈ మ్యాచ్‌కు అంపైర్‌గా ఓ లెవిల్ కోచ్ మట్టా సత్తిబాబు వ్యవహరించారు. వీరి వెంట కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి, తహసీల్దార్ టి.మంగతాయారు, ఎంపీడీఓ ఐ.రత్నంరాజు, సీఐ డి.ప్రశాంత్ కుమార్, హెచ్ఎం బీర హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

### నాలుగు రోజుల పాటు అన్నసమారాధనలు

**మలికిపురం:** మండలంలోని గూడపల్లి నూకాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకూ 4 రోజుల పాటు భారీ అన్నసమారాధనలు జరుగుతాయని ఆలయ చైర్మన్ సుందర నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన కమిటీ సమావేశంలో ఈ మేరకు వెల్లడించారు. నెల రోజులుగా జరుగుతున్న అమ్మవారి తీర్థం ఈ నెల 19తో ముగుస్తుందన్నారు. భక్తులు గమనించాలని సూచించారు. సమావేశంలో సుందర తాతాజీ, చెల్లుబోయిన వీవీ సత్యనారాయణ, పెచ్చెట్టి నరసింహస్వామి, కటికిరెడ్డి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పల్లెల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

**కాట్రేనికోన:** శివారు పల్లెల్లోనూ రహదారులను అభివృద్ధి చేసి, మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలో గెద్దనాపల్లి, దొంతికుర్రు, కందికుప్ప, పల్లంకుర్రు పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులు రూ.30 లక్షలతో గెద్దనాపల్లి పంచాయతీ శివారు బక్కివారిపేటలో సీసీ రోడ్డు పనులకు, దొంతికుర్రులో రూ.10 లక్షలతో రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి, కందికుప్ప పంచాయతీ గాజింగి తిప్పలో రూ.25 లక్షలతో మల్టీపర్పస్ కమ్యూనిటీ భవనం, పల్లంకుర్రు శివారు లైనేపేటలో రూ.25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించారు. నాయకులు ఏడిది చక్రపాణీరావు, పాలెపు ధర్మారావు(పల్లం), సంసాని నాగేశ్వరరావు, నల్లా నరసింహమూర్తి, నాతి సత్యనారాయణ, ఏడిది సుబ్బు, సానబోయిన నాగేశ్వరరావు, కాశి హనుమంతరావు, పాలెపు ధర్మారావు తదితరులు ఉన్నారు.



మల్టీపర్పస్ కమ్యూనిటీ భవన పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

## సమాజ సేవల్లో రెడ్‌క్రాస్ ముందంజ

**అమలాపురం రూరల్:** కొత్తపేట మండలం పలివెల గ్రామంలోని రెడ్‌క్రాస్ స్థలంలో త్వరలోనే రక్తనిధి కేంద్రం ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సమావేశం డీఆర్‌ఓ సత్తిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవల్లో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ముందంజలో ఉండాలన్నారు. దీనికి అవసరమైన ఆర్థిక వనరులను అందించడంలో సభ్యులు కీలక పాత్ర పోషించాలన్నారు. వాయు కాలుష్యాన్ని తగ్గించే చర్యలపై యువతకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. స్థానిక జిల్లా రెడ్‌క్రాస్ భవన విషయంపై జిల్లా కలెక్టర్‌తో చర్చించాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. జిల్లా సొసైటీ కార్యదర్శి డాక్టర్ పీఎస్ శర్మ మాట్లాడుతూ సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రక్తం అందక ఒక్క ప్రాణం కూడా కోల్పోకుండా రక్తదాన శిబిరాలను మరిన్ని నిర్వహించాలని కమిటీ నిర్ణయించిందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను నిరోధించాల్సిన అవసరంపై ప్రతి ఒక్కరికీ అవగాహన పెంచాలన్నారు. సొసైటీ ఉపాధ్యక్షుడు పీవీ రాజు, మేనేజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఓ సత్తిబాబు

## మత్స్యకారులకు నష్టం కలగనీయొద్దు

**యానాం:** తీర గ్రామాల ప్రజలు, మత్స్యకారులకు నష్టం కలుగకుండా కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ (సీజెడ్ఎంపీ) ఉండాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ కల్యాణ మండపంలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) 2019 నిబంధనల ప్రకారం పర్యావరణ మార్పుల శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పుదుచ్చేరి ప్రచురించిన తీర ప్రాంతం యొక్క కోస్టల్ జోన్ నిర్వహణ ప్రణాళికను తయారు చేస్తున్న నేపథ్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఆర్‌జెడ్ నోటిఫికేషన్ ప్రకారం తీర ప్రాంతాల కోసం 1:25000 స్కేల్‌లో కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ తయారు చేశారన్నారు. సీఆర్‌జెడ్ఎమ్‌పీ ప్లాన్ తీర ప్రాంత మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతీయకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కలెక్టర్ వల్లవన్ మాట్లాడుతూ తీర ప్రాంతాల్లోని మడ అడవులు, పగడాలు, ఇసుక దిబ్బలు, అభయారణ్యాలు, వన్యప్రాణులు ఉన్నాయన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం చదరపు కిలోమీటరుకు 2161 కంటే ఎక్కువ జనసాంద్రత కలిగిన ప్రాంతాలను సీఆర్‌జెడ్-3ఏలో ఉన్నాయని, దాని కంటే తక్కువ ఉన్న ప్రాంతాలను సీఆర్‌జెడ్-3బీలో ఉంచామన్నారు. అభ్యంతరాలను పుదుచ్చేరి పొల్యూషన్ బోర్డుకు సమర్పించాలని కోరారు. సమావేశంలో ఆర్ఏఓ మునిస్వామి, డీటీ సత్యనారాయణన్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్

### గాయపర్చిన ముగ్గురిపై కేసు

**అయినవిల్లి:** అక్కతమ్ముళ్లను గాయపర్చిన ముగ్గురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఎన్.పెదపాలెంలో మంగళవారం రాత్రి బొక్కా లక్ష్మణరావు, చక్రవర్తి, రామకృష్ణలు గొడవపడుతున్నారు. రాత్రి గొడవలేంటి అని సానబోయిన ఉమాలక్ష్మి, ఆమె సోదరుడు ముషిణి ఈశ్వరరావు అడిగారు. ఆగ్రహించిన లక్ష్మణరావు, చక్రవర్తి, రామకృష్ణలు ఉమాలక్ష్మి, ఈశ్వరరావులను గాయపరిచారు. దీనిపై ఉమాలక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.